
# వెన్నెలవీణ

ఆర్. సంధ్యాదేవి



జీవన్‌కృష్ణ చదువుతున్న పుస్తకం మూసేసి విసుగ్గా పక్కకు తిరిగి పడుకున్నాడు.

అతనికి అలా మంచంమీద పడుకుని ఉండటం విసుగ్గా కాళ్ళూ చేతులు కట్టేసినట్టుగా అనిపిస్తోంది.

జీవన్‌కృష్ణ టాక్సీలో తమ ఊరు వెళ్తూంటే యాక్సిడెంటయింది. డ్రైవర్ అక్కడికక్కడే చనిపోయాడు. అతనికి దెబ్బలు తగలటంతో అక్కడ దగ్గరలో ఉన్న పల్లెటూరిలో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళారు. పెద్ద దెబ్బలు తగలకపోయినా నుదుటిమీద గాయం అయింది. మోచేతిమీద గాయం అయింది.

పల్లెటూరిలో ఊరికి దూరంగా ఉంటున్న మాధవరావుగారు జీవన్‌కృష్ణని బండిలో తమ యింటికి తీసుకువెళ్ళారు. ఒక వారం రోజులు అతన్ని కదలనివ్వకుండా మంచంమీద రెస్ట్‌గా అలా ఉంచారు. అతను ఏమాత్రం కదలడానికి చూసినా మాధవరావుగారు ఊరుకునేవారు కాదు. డాక్టర్ వచ్చి చూసి వెళుతుండేవారు.

జీవనకృష్ణకి మాధవరావుగారు అంటే ఒక విధమైన భక్తి, గౌరవం ఏర్పడ్డాయి. తనెవరో తెలీదు అయినా స్వంతబిడ్డకంటే ఎక్కువగా చూస్తున్నారు అనుకున్నాడు.

మాధవరావుగారి యిల్లు చిన్న పర్ణశాలలా ఉంటుంది. చుట్టూ తోట. మధ్యన బాగా చిన్న యిల్లు. ఊరికి దూరంగా ఉండటంవలన నిశ్శబ్దంగా ప్రశాంతంగా హాయిగా ఉంటుంది.

జీవన్‌కృష్ణ ఇంజినీర్. అయిదు సంవత్సరాలు స్టేట్స్‌లో ఉండి ఇప్పుడు స్వదేశం తిరిగివచ్చాడు. అతనికి తండ్రి, అన్నదమ్ముళ్ళు ఎవ్వరూ లేరు. తల్లి ఉంది. తండ్రి అతనికి పదిహేను సంవత్సరాల వయసు అప్పుడు చనిపోయాడు.

తల్లి ఎలా ఉందో ఏమిటో? ఎంత త్వరగా తల్లిని చూద్దామా అని వస్తుంటే దారిలో ఈయాక్సిడెంట్ అయి మంచంలో పడ్డాడు. తల్లికి తను ఫలానా రోజున వస్తున్నట్టు తెలియచెయ్యలేదు. ఈ నెలలో వచ్చేస్తున్నట్టు మాత్రమే వ్రాశాడు అనుకున్న టైముకి వెళ్ళకపోతే తల్లి కంగారుపడ్తుంది.

తను అందర్నీ చూడాలని తొందరపడుతున్నాడు. మేనమామగారింటికి వెళ్లాలని, మావయ్యకూతుళ్ళు ఇద్దర్నీ చూడాలని మనసు వేగిరపడుతుంది. మాధవరావుగారు అతన్ని ఎక్కడా కదలనివ్వటం లేదు.

జీవన్‌కృష్ణ ఆలోచిస్తున్నవాడల్లా గుమ్మందగ్గర గాజులు గలగల శబ్దం వినిపించటంతో చటుక్కున తలతిప్పి చూశాడు.

పాలగ్లాసుతో ఆ అమ్మాయి లోపలకు వస్తోంది.

ఆ అమ్మాయి మాధవరావు కూతురు అని గ్రహించుకున్నాడు. ఆమె కూడా అతనికి చాలా సేవచేసింది అనే చెప్పాలి. దెబ్బలు తగిలినరోజు అయితే తండ్రీ కూతురు అసలు కదలకుండా తన మంచంవద్దే కూర్చున్నారు.

వేళకు అన్నీ ఆ అమ్మాయే చూస్తుంటుంది. చిరునవ్వుతో చూశాడు ఆమెవైపు. అప్పుడే ఆమె కూడా అతనివైపు చూసింది. క్షణంసేవు ఆ చూపులు ఒకటిగా అల్లుకుపోయాయి.

ఆమెవైపు చూపులు తిప్పుకోలేకపోయాడు. తెల్లగా సన్నగా పొడవుగా బంగారుతీగలా అందంగా చక్కగా

ఉంది. మనిషిలో అందం, ఆకర్షణ పోటీ పడుతున్నాయి.

నల్ల జార్జెట్ చీర, నల్ల జాకెట్, చేతికి నల్ల గాజులు, నుదుట ఎర్రని గుండ్రని పెద్దబొట్టు పెద్ద జడతో ఆమె అందంతో మెరిసిపోతుంది.

ఈ అమ్మాయి పేదపిల్లయినా ఎంత చక్కగా ఉంది. ఆ కళ్ళు అందమైన కోలకళ్ళు: మీనాల్లాంటి ఆ విశాల నయనాలు చూస్తుంటే అబ్బా! ఎవరు ఈ అమ్మాయి! తనకి ఎంతో దగ్గరగా ఎన్నాళ్ళగానో పరిచయం ఉన్నట్లు అనిపిస్తుంది. ఆలోచిస్తూ అలాగే రెప్పవాల్చకుండా చూడసాగాడు.

ఆమె ఒక్క క్షణం తడబడినట్టయి చప్పున చూపులు తిప్పుకుంది. అతను తెల్లగా,పొడవుగా,బలంగా,ఆరోగ్యంగా, అందంగా, ఠీవిగా ఉన్నాడు. అతన్ని చూస్తూనే బాగా చదువుకున్నవాడు, పెద్ద ఉద్యోగంలో ఉండి పెద్ద ఐశ్వర్యవంతుల కుటుంబంలో పుట్టిన మనిషి అందుకే అతనిలో ఆ దర్జా అందం ఉన్నాయి అనుకుంది. మనిషిని చూస్తే మంచివాడు మర్యాదస్తుడులా కనిపిస్తున్నాడు. తనని చూస్తూనే రెప్ప వాల్చకుండా ఎందుకలా చూస్తాడు! ఆమె తల వంచుకుని కాలి బొటనవ్రేలు నేలమీద రాస్తూ మౌనంగా నిలబడింది,

"లోపలకి రండి ఏమిటి అక్కడనే నిలబడిపోయారు!" నవ్వుతూ మంచం మీద లేచి కూర్చున్నాడు.

"పాలు తీసుకువచ్చాను" అంటూ మెల్లగా చెప్పి ఒక్కో అడుగే మెల్లగా వేస్తూ మంచందగ్గరకు నడిచివెళ్ళి గ్లాసు అందివ్వబోయింది.

"ఇంతకూ మీ పేరు ఏమిటో చెప్పారు కాదు. మీకు అభ్యంతరం లేకపోతే...." అంటూ నవ్వాడు. ఆ నవ్వు ఎంత నిండుగా కోట్లపున్నెమలకాంతి వెదజల్లినట్టుగా ఎంత చక్కగా ఉంది.

ఆమె మెల్లగా చెప్పింది. "ఆరాధన"

"ఆరాధన" తనలో తాను అనుకున్నట్టుగా తృప్తిపడినట్టు అయ్యాడు. అతని కనుబొమ్మలు ప్రశ్నార్థకంగా ముడిపడ్డాయి.

ఆమె చేతిలోని పాలగ్లాసు అందుకుని పక్కనపెట్టి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆ చెయ్యి గట్టిగా బిగుసుకుంది.

"నీ పేరు ఆరాధనా! నిజంగానా! నువ్వు! నువ్వు!...." అంటూ ఆగిపోయాడు.

ఆమె అతను అలా చెయ్యి పట్టుకోగానే భయంగా చూసింది. 'ఏమిటిది! ముందు చెయ్యి వదలండి' అన్నట్టు చూస్తూ ఆ పట్టు విడిపించుకోడానికి చూసింది.

"నువ్వు మాధవరావుగారి అమ్మాయివా!"

"కాదు!" భయంగా చూసింది.

"కాదూ! మరి ఎవరి అమ్మాయివి! చెప్పు, మీ తల్లిదండ్రుల పేరు!" అడిగాడు. అతని స్వరంలో ఆతృత కొట్టవచ్చినట్టు తెలుస్తుంది.

"లేరు. నా చిన్నతనంలో చనిపోయారు. మాధవరావుగారు నా తండ్రి కాకపోయినా నన్ను కన్నతండ్రిలాగే పెంచి ప్రాణంగా చూస్తున్నారు" అంటూ టూకీగా తన గురించి చెప్పింది. అంతే అతని కళ్ళు ఒక్కసారి సంతోషంతో కాంతిని వెదజల్లాయి. ఒక్కక్షణం ఆ మాటలు నమ్మశక్యం కానట్టు తనకి తాను ఎటూ సమాధానం చెప్పుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

"అరూ! నిజంగానా నువ్వు మాధవరావుగారి అమ్మాయివి కాదా!" అంటూ చెయ్యిపట్టి దగ్గరకు లాక్కున్నాడు, ఆపుకోలేని ఆనందంతో.

అనుకోని సంఘటనకు తూలి అతనిపై పడింది.

అతను ఆమెను రెండు చేతులతో బంధించి మరింత దగ్గరకు లాక్కున్నాడు. "అరూ! నేనెంత అదృష్టవంతుడ్ని. భగవంతుడు నిజంగా ఎంత దయామయుడు. తిన్నగా నన్ను ఈ విధంగా నీ వద్దకు తీసుకువచ్చాడు," అన్నాడు, ఒక్క క్షణం మైమరచిపోతూ ఆమెను ఉక్కిరిబిక్కిరిచేసేస్తూ.

"ఏమండీ! ఏమిటిది! వదలండి" అంటూ భయంతో సిగ్గుతో అతని పట్టు విడిపించుకొనడానికి ప్రయత్నించ సాగింది.

"నీ కోసం అంతదూరంనుండి పరుగెత్తుకు వచ్చాను. నా వద్ద నుండి తప్పించుకోవాలనా నీ ప్రయత్నం" అంటూ ఆమె కళ్ళల్లోకి చూసి నవ్వాడు.

ఆరాధన క్షణంసేపు అలా చూస్తూ ఉండిపోయింది.

"మాధవరావుగారితో మాట్లాడి నిన్ను వివాహం చేసుకుని నిన్ను నా భార్యగా చేసుకుంటాను. నన్ను నమ్ము" అంటూ చెప్పాడు.


"నిజమా! మీరు నన్ను...." అంటూ ఆపై ఏం మాట్లాడాలో తోచనేలేదు ఆమెకు. అతను ఎవరో తెలీదు. యాక్సిడెంట్ అయి దెబ్బలు తగిలితే యింటికి తీసుకువచ్చారు మాధవరావుగారు. ఇతని మాటలు వింటుంటే నమ్మశక్యం కాకుండా ఉంది. అలా అని అతను అబద్ధం చెప్పే మనిషిగానూ కన్పించటంలేదు. అంతా చిత్రంగా, మాయగా ఉంది.

"అరూ!"

ఆమె సిగ్గుతో మాట్లాడలేకపోయింది.

* * *

జీవన్‌కృష్ణకు మాధవరావుగారితో తన మనసులో మాటచెప్పి ఆయనచేత ఊఁ అనిపించి యింటికి ప్రయాణం అయ్యాడు. మాధవరావుగారు ఆరాధన గురించి అంతా చెప్పారు. తాయారమ్మగారు, కేశవరావుగారికి సరళ అన్న అమ్మాయి ఒక్కర్తే కేశవరావుగారి అన్న



గారి కుమార్తె. ఆరాధన తల్లితండ్రి చనిపోతే పినతండ్రి యింట్లో పెరిగింది. ఈ రోజుల్లో ఒక అమ్మాయి పెళ్ళి చెయ్యాలంటే కష్టం ఈ అమ్మాయికి పెళ్ళి చెయ్యాలంటే మాటలా! తెలిసిన అతన్ని కాబట్టి ఈ అమ్మాయిని నెల రోజుల క్రితం నా యింటికి పంపించేశారు. ఏదో తగిన సంబంధం అఖరికి పొలంలో పనిచేసే పాలేరుకి అయినా సరే ఇచ్చి పెళ్ళిచేసేయ్యమని. వాళ్ళు అలా అన్నా సరే మనసు ఒప్పలేదు. పిల్ల బంగారు బొమ్మలా ఉంది. చూస్తూ చూస్తూ ఒక పాలేరుకి ఇచ్చి ఎలా కట్టబెట్టేస్తాను. నా దగ్గర అంత డబ్బులేదు. ఈ అమ్మాయి జీవితం ఎలా ఒడ్డున పడేయటమా అనిఅలోచిస్తున్నాను బాబూ! అమ్మాయి అదృష్టవంతురాలు. కోరి పెళ్ళి చేసుకుంటా నంటున్నారు." అంటూ ఆరాధన గురించి వివరంగా చెప్పి ఆయన చాలా సంతోషించాడు.

ఆ ఊళ్ళోనే గుడిలో పెళ్ళి చేసుకోవడానికి ముహూర్తం పెట్టించమని చెప్పి తల్లిని తీసుకురావడానికి వెళ్ళాడు.

* * *

వేణుగోపాలస్వామి ఆలయంలో జీవన్‌కృష్ణ, ఆరాధనల పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది.

జీవన్‌కృష్ణ తల్లి అన్నగారికి ఉత్తరం వ్రాసింది. నేను కృష్ణని తీసుకుని మీ యింటికి వస్తున్నాను. మీరు వ్రాసిన ఉత్తరం అందింది. విషయాలు తెలిశాయి. చిన్నప్పటినుండి అనుకున్న అమ్మాయి ఆమెనే నా కోడలుగా చేసుకోవాలనుకొన్నాను. ఇద్దరికి వ్రాసిపెట్టి లేదు, ఏం చేస్తాం! వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుకుందాం అని.

జీవన్‌కృష్ణ తల్లితో మేనమామగారి యింటికి వెళ్ళాడు.

ఆ తల్లీకొడుకుల రాకకు ఆ భార్యాభర్తలు ఇద్దరూ చాలా సంతోషించారు.

కేశవరావుగారు, తాయారమ్మ కళ్ళనీళ్ళు తెచ్చుకున్నారు. తల్లీ, తండ్రీ లేని పిల్ల. ఆమె పెళ్ళి మా చేతులమీద చెయ్యాలని అనుకున్నాం. పాపిష్ఠిది యింటి పరువుతీసి పొలంలో పనిచేసే పాలేరుతో లేచిపోయింది. ఆ బెంగతో మంచం పట్టాం. నీవు, అబ్బాయి వస్తే మేము ఏం చెప్పాలి అని.

జీవన్‌కృష్ణమౌనంగాఉండిపోయాడు.

అతని ముఖం శాంతగభీరంగా ఉంది. ముఖంలో ఎలాటి భావాలు వ్యక్తం కాలేదు. అతని తల్లి కూడా మౌనంగా ఉండిపోయింది. "ఏం చేస్తాం వదినా? పెద్దన్నయ్య ఉంటే అలా జరిగేది కాదు." అంటూ వదినగార్ని ఊరడించి మౌనం వహించింది ఆవిడ.

"జరిగింది ఏదో జరిగిపోయింది. వాళ్ళ ఇద్దరికి ఎలాగూ వ్రాసి పెట్టి లేదు. అన్నయ్య కూతురు అయితేనేం? నా కూతురు అయితేనేం? మా సరళను నీ కోడలుగా చేసుకో," అన్నారు కేశవరావుగారు మెల్లగా, అసలు విషయానికి వస్తూ.

ఆవిడ చిన్నగా నవ్వుతూ అంది, "నాకేం అభ్యంతరం లేదు అన్నయ్యా. అంతా వాడి ఇష్టం. వాడు ఒప్పుకుంటే

నేను సంతోషిస్తాను." ఏం బాబు అన్నట్టు కొడుకువైపు చూసింది ఆవిడ. కేశవరావుగారి దంపతులు, సరళ అందరూ అతనివైపు చూశారు.

"క్షమించు, అమ్మా! నీకు అభ్యంతరం లేకపోవచ్చు. నాకు అభ్యంతరం ఉంది" అన్నాడు. అతని ముఖం గంభీరంగా ఉంది.

"ఏమిటి బాబూ! ఏ విషయంలో?" అడిగారు కేశవరావుగారి దంపతులు తెల్లబోయినట్లు చూస్తూ.

"కృష్ణా! ఏమిటి బాబూ!" అడిగింది ఆవిడ కొడుకుని.

"నన్ను మీరు అందరూ మన్నించాలి. పరువుగల యింటి ఆడపిల్ల యింటినుండి లేచిపోయింది అంటే, ఆ వంశానికే చెరగని మచ్చ ఏర్పడింది అన్నమాటే. పెద్దమావయ్య అయినా చిన్న మావయ్య అయినా ఒకటేగా! లేచిపోయిన కుటుంబంలో పిల్లని నేను పెళ్ళి చేసుకుని నలుగురిలో నవ్వులపాలు కాలేను. అందుకే నాకు సరళను పెళ్ళి చేసుకోవటం ఇష్టంలేదు." కచ్చితంగా చెప్పేశాడు.

"నా అన్నకూతురు చేసిన తప్పుకి నా కూతురు శిక్ష అనుభవించాలా!" సూటిగా అడిగారు ఆయన.

"క్షమించాలి. ఈ విషయం అమ్మ చెప్పగానే నా నిర్ణయం మారిపోయింది. పెద్ద మావయ్య కూతుర్ని చిన్నప్పుడు ఎప్పుడో చూసినా మావయ్య కూతురు అన్న అభిమానంతో నచ్చాలి అనే ప్రసక్తి లేకుండా పెళ్ళి చేసుకోవాలనుకొన్నాను.ఆమెపాలేరుతో లేచిపోయింది. అక్కబుద్ధి చెల్లెలికి రాదని నమ్మకం ఏమిటి! ఆమె పెళ్ళి కాకుండా లేచిపోయింది. ఈమె నాతో పెళ్ళి జరిగాక లేచిపోతే నా పరువు ఏంగాను! అందుకే నేను ఒక పేదపిల్లని వివాహం చేసుకున్నాను. ఆమెను తీసుకు వస్తాను ఉండండి!" అంటూ జీవన్‌కృష్ణ కారులో ఎక్కడికో వెళ్ళి పది నిమిషాల్లో భార్యను వెంటబెట్టుకు వచ్చాడు.

జీవన్‌కృష్ణ భార్యను చూస్తూనే కేశవరావుగారి దంపతుల ముఖాలు నల్లగా మాడిపోయాయి.

జీవన్‌కృష్ణ ఫారిన్‌నుండి వస్తున్నాడని పెద్ద అన్నయ్య కూతురు ఆరాధనతో పెళ్ళి జరిపించాలి, తొందరలో ముహూర్తం పెట్టించాలి అని జీవన్‌కృష్ణ తల్లి కేశవరావుగారికి ఉత్తరం వ్రాయటంతో ఆరాధనకి జీవన్‌కృష్ణలాంటి గొప్ప వ్యక్తితో పెళ్ళి జరగటమా! ఆ అదృష్టం తమ కూతురుకి ఎందుకు కలగకూడదని భార్యాభర్తలు ఇద్దరూ ఆలోచించి ఆరాధనని మాధవరావు యింటికి పంపించేసి ఆమె మీద అలా పుకారు పుట్టించేశారు. అలా అంటే ఆరాధన అంటే అసహ్యం కలిగి సరళని వివాహం చేసుకుంటాడని ఆశపడ్డారు.

ఇప్పుడు కథ అడ్డం తిరిగింది. ఆరాధన జీవన్‌కృష్ణకి ఎలా తెలిసింది! నోట మాటరాక నిశ్చేష్టులై అలాఉండిపోయారు.

"ఏమిటి మావయ్యా అలా చూస్తున్నారు!" అంటూ అదో రకంగా నవ్వాడు.

"ఆరాధన పాలేరుతో లేచిపోయింది అన్నారే, ఆ పాలేరుతో కలిసి మీ యింటికి వచ్చింది. మీ ఆశీస్సులు పొందాలని. ఏమిటి మాట్లాడరు?" అడిగాడు. ఈసారి అతని కంఠస్వరం ఖంగ్‌మంది.

"నోరులేని అమాయకురాల్ని చేసి దురదృషం అనే ముద్రవేసి ఈమె అదృష్టాన్ని దోచుకుందామని ఆశపడ్డారు. తల్లీ, తండ్రీ లేని పిల్ల, దిక్కూ, మొక్కూ లేనిది అని చివరకు ఆమె ఆశలని, ఆనందాన్ని సమాధి చెయ్యాలని ఇంతకు సాహసిస్తారా! ఆరాధన పాలేరుతో లేచిపోయిందని లోకానికి చాటి చెప్తారా! మీకూ ఒక ఆడపిల్ల ఉంది. ఆమెకు పెళ్ళి కావలసి ఉంది. తల్లి, తండ్రి చేసిన పాపాలే కన్నపిల్లల మెడలకు ఉరిత్రాడు అయి బిగుసుకుని వాళ్ళ ఆశలు, ఆనందాలు నామరూపాలు లేకుండా పోతాయి. మావయ్యా, మీరు పెద్దవారు అయిఉండీ ఒక కన్నెపిల్లమీద అభాండం వేసి యింట్లోంచి బయటకు గెంటేశారు. ఇందుకు ఆరాధన మిమ్మల్ని క్షమించినా ఆ భగవంతుడు మాత్రం మీకు శిక్ష విధించకుండా మానడు! వస్తాను." అంటూ భార్య భుజాలచుట్టూ చెయ్యి వేసి "పద అరూ" అంటూ ముందుకి కదిలాడు. ఆరాధన తల వంచుకుని భర్తతో వెనుతిరిగింది. జీవన్‌కృష తల్లి కేశవరావుగారి దగ్గరకు వెళ్ళి

"అన్నయ్యా! నీకూ ఒక కూతురు ఉందనీ, ఆమె సుఖసంతోషాలతో ఉండాలని స్వార్ధంతో పెద్దఅన్నయ్య కూతురి అదృష్టాన్ని కాలరాసిపారేయడానికి చూశావు. మనుష్యులని దూరం చెయ్యగలవు గాని మనసులని దూరం చెయ్యలేవు. పుట్టిన ప్రతి శిశువు నుదుట ఏనాడో వ్రాసేస్తాడు ఆ బ్రహ్మ. ఆ రాతలని ఎవ్వరూ తుడవలేరు. బ్రహ్మముడి మానవమాత్రులు ఎవ్వరూ విప్పలేనిది. కృష్ణ, ఆరాధనలు భార్యాభర్తలుగా వాళ్ళు పుట్టిననాడే వ్రాసిపెట్టి, ముడివేసేశాడు ఆ విధాత. వాళ్ళ అదృష్టాన్ని నోచుకోలేరు ఎవ్వరూ. ఆరాధన అదృష్టవంతురాలు గనుకనే నా కొడుకు ఆ విధంగా ఆ మాధవరావుగారింటికి వెళ్ళటం జరిగింది. అర్ధం అయిందా! అమాయకురాళ్ళ అదృష్టాన్ని ఎవ్వరూ దోచుకోలేరు," అంటూ ఒక్కోమాటే నొక్కి చెప్పి కొడుకుతో, కోడలితో బయలుదేరి వెళ్ళిపోయిందావిడ.

ఆ రోజు నూతన దంపతుల తొలిరోజు. జీవన్‌కృష్ణ గదిలో అడుగు పెట్టింది ఆరాధన. అతను మెల్లగా ఆమె వద్దకు వెళ్ళి బుజాలపై చెయ్యివేసి తనవైపుకి తిప్పుకున్నాడు.

"అరూ!" అంటూ మృదువుగా లాలనగా పిలిచాడు. ఆరాధన ఒక్కక్షణం భర్తవైపు రెప్పవాల్చకుండా అలాగే చూసింది. అప్రయత్నంగా వంగి అతని పాదాలకి నమస్కరించింది. "అరూ! ఛ ఏమిటిది!" అంటూ ప్రేమగా లేవనెత్తి అక్కున చేర్చుకున్నాడు.

"ప్రతి స్త్రీకి భర్త దేముడులా కనిపిస్తాడు. నా దైవాన్ని నేను పూజించటంలో తప్పేమిటి! మిమ్మల్ని భర్తగా పొందగలిగిన నేను ఎంత అదృష్టవంతురాల్ని!" అంటూ సంతోషంతో పొంగిపోతూ అతని హృదయంమీద వాలిపోయింది.

"అరూ!" అంటూ పొంగులువారిన సంతోషంతో అతి ప్రియంగా అపురూపంగా చేతులతో చుట్టేస్తూ మరింత దగ్గరకు లాక్కున్నాడు.

ఆకాశంలో చందమామ వెన్నెల వెదజల్లుతూ చల్లగా నవ్వింది. ✽